శిథిల పుట్‌పాత్‌లతో.. భయం భయం

- తేలుతున్న టైల్స్
- నోళ్లు తెరుచుకున్న బీఆర్‌టీఎస్ కల్వర్టులు
- చీకటి పడితే ప్రయాణానికి అవస్థలు
- ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు


ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రమాదభరితంగా కల్వర్ట్


ఊర్వశి కూడలిలో ప్రమాదభరితంగా పుట్‌పాత్

కంచరపాలెం: జీవీఎంసీ 54,55 వార్డుల పరిధిలోని మర్రిపాలెం, 104 ఏరియా, కంచరపాలెం, ఊర్వశికూడలి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్ గల బీఆర్‌టీఎస్ రహదారులకు ఆనుకుని నిర్మించిన పుట్‌పాత్‌లు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిపై నిర్మించిన టైల్స్ తేలుతున్నాయి. కల్వర్టులు, డక్‌లు, మురుగు కాల్వలు నోళ్లు తెరుచుకుని కనిపిస్తున్నాయి. చెత్తాచెదారాలతో నిండిపోతున్న కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులు, శానిటరీ సిబ్బంది స్పందించక పోవడంతో ఆయా ప్రాంతాల్లో పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్‌టీఎస్ పుట్‌పాత్‌లపై గల కల్వర్టులతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదచారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థలతో అవస్థలు..

ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ రహదారి నుంచి జాషువానగర్, కొత్త రెడ్డికంచరపాలెం, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం, వివేకానందవీధి, దుర్గానగర్, శ్రీనగర్, రవీంద్రనగర్, దేవేంద్రనగర్, సిద్ధార్థనగర్, గజపతినగర్, సుంకురపేట, బాపూజీనగర్, మహారాణి వీధి, ఊర్వశి కూడలి, కంచరపాలెం రైతుబజారు ప్రాంతాల్లో మురుగు కాల్వల నుంచి పూడికలు తీసేందుకు గతంలో వాటిపైన సిమెంటు దిమ్మలు (పలకలు) తొలగించారు. పూడిక తీశాక ఆ పలకలను సక్రమంగా అమర్చాల్సిన జీవీఎంసీ సిబ్బంది ఆ పనిని అస్తవ్యస్తంగా వదిలేయడంతో అవి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

ప్రమాదాల్లో పాదచారులు..

బీఆర్‌టీఎస్ అసంపూర్తి పనులు, కల్వర్టులపై తొలగించిన పలకలను సక్రమంగా వేయకపోవడం వల్ల కంచరపాలెం మెయిన్‌రోడ్డు నుంచి ఊర్వశి కూడలి, పరిసరాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలకలు ఒకచోట వేసి మరోచోట వదిలేయడం వల్ల రంధ్రాలు నోళ్లు తెరుచుకుని కనిపిస్తున్నాయి. ఎవరైనా పొరపాటున వాటిలో జారితే ఇక ప్రాణాలపై ఆశ వదిలేసుకోవాల్సిందేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సిమెంట్ దిమ్మలు చిందరవందరగా వేయడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


ఐటీఐ జంక్షన్‌లో తెరుచుకుని ఉన్న సిమెంట్ దిమ్మలు


దుర్గానగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన కల్వర్ట్

టైల్స్ తేలుతున్నాయి..

పుట్‌పాత్‌లపై ప్రమాదభరితంగా పలకలు దర్శనమిస్తున్నాయి. వాటిపై టైల్స్ తేలుతున్నాయి. రోడ్డుపై నడిస్తే వాహనాల ఇబ్బంది.. పుట్‌పాత్‌లపై ప్రయాణం నరకానికి నిదర్శనంగా నిలుస్తుంది. కాలువల్లో పూడికలు తీసే సమయంలో నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయం వేస్తుంది. పుట్‌పాత్‌లు ప్రమాదభరితంగా నోళ్లు తెరుచుకున్నాయి.
– కె.కిరణ్‌కుమార్, పాదచారుడు, రవీంద్రనగర్, ఊర్వశికూడలి

కల్వర్టులపై దిమ్మలు వేయాలి..

బీఆర్‌టీఎస్ రహదారి నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. కల్వర్టుల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. పూడికలు తొలగించినపుడు తీసే పలకలు సరిగా వేసేలా ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అస్తవ్యస్తంగా టైల్స్ తేలి, సిమెంటు దిమ్మలు నోళ్లు తెరుచుకున్నాయి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు స్పందించాలి.
– ఆర్. విజయలక్ష్మి, బాపూజీనగర్, 104 ఏరియా


104 ఏరియాకు వెళ్లే దారిలో శిథిలావస్థవలో పుట్‌పాత్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుల నియామకం



సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలోని పలు వార్డులకు వార్డు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

వార్డు	అధ్యక్షుడు
14	బల్ల శ్రీనివాస్
24	గుడ్ల అశోక్‌కుమార్‌రెడ్డి
26	బొడ్డేటి కిరణ్
44	మొహ్మద్ హబీబ్
45	పైడి రమణ
46	బాలిరెడ్డి గోవింద్‌రాజు
47	కుందిరి సుకుమార్
49	అయినింటి రవికుమార్
50	లాలం వేణుగోపాలస్వామి

యోగాంధ్ర సాధన

మురళీనగర్: ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ముందస్తుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం యోగాసనాల సాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నారాయణరావు పర్యవేక్షణలో, కోఆర్డినేటర్ డాక్టర్ యమున విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాంధ్రలో పాల్గొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపాల్ నారాయణరావు సూచించారు. ఈ యోగా సాధన కార్యక్రమంలో పాలిటెక్నిక్ డిప్లమా కోర్సు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ


యోగాసనాలు ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్‌లో నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి. విశ్వనాథం సన్నద్ధం చేశారు. విద్యార్థులతో సూర్య నమస్కారాలు, యోగాకు సంబంధించిన పలు రకాల ఆసనాలను ఆయన ప్రాక్టీస్ చేయించారు. పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులు యోగాంధ్రాలో హాజరు కావడానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు హెచ్‌ఎం జయంతి రాధా కుమారి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాసరావు, నిర్మల, మారుతి అశోక్ పాల్గొన్నారు.

పల్లాకు మంత్రి జనార్దన్‌రెడ్డి పరామర్శ


పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

సీతంపేట: రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సీతంపేటలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి ఇటీవల స్వర్గస్తులైన పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులు అర్పించారు. పల్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, సింహాచలం మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆరోగ్య విశాఖ లక్ష్యం

ఎంవీపీకాలనీ: ఆరోగ్య విశాఖ లక్ష్యంగా నగర ప్రజలంతా యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రలో భాగంగా, జీవీఎంసీ జోన్-3 యంత్రాంగం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలను యోగా దిశగా నడిపించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. నగర ప్రజలంతా యోగాంధ్రలో పాల్గొని విశాఖ పేరు మీద రికార్డులను సైతం సృష్టించాలని ఆయన కోరారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం


రైల్వేస్టేషన్‌లో యోగాసనాలు వేస్తున్న వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి వాల్తేర్ డివిజన్ సిద్ధమవుతోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే యోగా జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. దైనందిన జీవితంలో యోగా చేయడం వల్ల నరాలకు సత్తువ, మానసిక బలం, సరైన శరీరాకృతి లభించడమే కాకుండా, ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయని వివరించారు. యోగా దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు యోగాసనాలు అభ్యాసం చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, అలాగే 21వ తేదీన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ వంటి ప్రధాన స్టేషన్లలో ప్రత్యేక యోగా క్యాంపుల ద్వారా యోగాసనాలు నేర్పిస్తున్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ సభ్యులు, నేవీ సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సీనియర్ యోగా గురువులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానానికి సంబంధించిన చిట్కాలను నేర్పిస్తున్నారన్నారు. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవల్ సర్వీసెస్ విశ్వకర్మ సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 వేడుకల కోసం సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ గేట్ వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కే. సందీప్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2 కే. పవన్ కుమార్‌తో పాటు 100 మంది రైల్వే ఉన్నతాధికారులు, 25 మంది నేవీ ఉన్నతాధికారుల నాయకత్వంలో విభిన్న యోగాసనాలు, ప్రాణాయామం, మెడిటేషన్ చిట్కాలు నేర్చుకున్నారు.

భాష్యం స్కూల్‌లో బుక్ స్టోర్ సీజ్


సీతంపేట భాష్యం స్కూల్‌లో పుస్తకాలు సీజ్ చేసిన ఎంఈవో బాలామణి

సీతంపేట: స్థానిక సీతంపేట భాష్యం స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేరుతో ముద్రించిన స్కూల్ బుక్స్, యూనిఫాం, బ్యాగ్స్ విక్రయాన్ని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) అడ్డుకుంది. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు ఫిర్యాదు మేరకు ఎంఈవో కె.అమృత బాలామణి పాఠశాలకు చేరుకుని బుక్ స్టోర్‌ను పరిశీలించారు. ఎటువంటి ఎంఆర్‌పీ లేకుండా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్ పేరుతో ముద్రించి అమ్ముతున్న బుక్స్, యూనిఫాం, బ్యాగ్స్, స్టేషనరీని గుర్తించి బుక్ స్టోర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బుక్స్, యూనిఫాం, బ్యాగ్స్, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న భాష్యం యాజమాన్యాన్ని అడ్డుకున్నామని తెలిపారు. జిల్లాలో పూర్తిస్థాయిలో విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని, అధికారులు చేయవలసిన పనిని ఏఐఎస్‌ఎఫ్ చేయాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు అనుమతులు లేని కళాశాలలు, స్కూల్స్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజుల దోపిడీ, పుస్తకాల పేరుతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. లేని పక్షంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, సభ్యులు గ్రేస్ ప్రకాష్, గణేష్, అభి పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ జాతర


పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 54,57 వార్డులల పరిధిలో ఐటీఐ జంక్షన్, సంకురపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి ప్రధాన జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యుల ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభం అయింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశి కూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. భక్తులు అమ్మవారి మూలవిరాట్‌తో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఘటాలను అమ్మవారి ఆలయం వద్దకు చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఐదవ పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు మురళి, రమణ, శంకర్, రాము, సూరిబాబు, రామకృష్ణ, నూకరాజు, జగదీష్, బాలు, శ్యామ్ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా ముత్యమాంబ పండగ


ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ


అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


పండగలో భక్తుల కోలాహలం

సీతంపేట: అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగను మూడుగుళ్ల వద్ద గల గౌరీ సేవా సంఘం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించింది. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి జలాభిషేకం, కుంకుమపూజలు జరిపారు. 42, 43, 44, 26 వార్డులకు చెందిన అక్కయ్యపాలెం, జగన్నాథపురం, శ్రీనివాసనగర్, రామకృష్ణానగర్, మాదేటిగార్డెన్స్ ప్రాంతాలకు చెందిన గవర కులస్థులు, స్థానికులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించి పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయ పరిసరాలను పూలదండలు, వేప మండలు, విద్యుత్ దీపాలు, ఎల్ఈడీ ఫ్లెక్సీలతో అందంగా అలంకరించారు.

ఆకట్టుకున్న తిరువీధి ఊరేగింపు : శతకం పట్టు నుంచి మూడుగుళ్ల అమ్మవార్ల ఆలయం వరకు మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలతో కూడిన తిరువీధి మహోత్సవం కనుల పండువగా జరిగింది. అమ్మవారి ప్రతిమను అక్కయ్యపాలెం వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు, హారతులతో, ధూప దీపాలతో అమ్మవారికి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలైన కోలాటం, తప్పెటగుళ్లు, పులి వేషాలు, గరిడీలు, నేల డ్యాన్సులు, గ్రామ దేవతల డ్యాన్సులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆర్కెస్ట్రా, బుర్రకథలు వంటి స్టేజి ప్రోగ్రామ్స్ కూడా భక్తులను అలరించాయి. పండగలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద కొనుగోళ్లతో సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆయనకు సాదరంగా ఘన స్వాగతం పలికింది. అలాగే స్థానిక కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. పండగ సందర్భంగా మళ్ల శివ ఏర్పాటు చేసిన సెలబ్రిటీ స్టేజ్ షోలో సినీనటులు షకీలా, సునీల్‌శెట్టి, జబర్దస్త్ నటులు అప్పారావును చూడటానికి జనం ఎగబడ్డారు. వారితో సెల్ఫీల కోసం యువత పోటీ పడింది. కార్యక్రమ ఏర్పాట్లను గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు రాజగిరి అప్పలరాజు, గౌరవాధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, కమిటీ చైర్మన్ మళ్ల త్రినాథరావు, వైస్ చైర్మన్ ఆదారి పారుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి ఈశ్వర అప్పారావు, కోశాధికారి పిల్లా గోపి, ఆడిటర్ పొలమరశెట్టి అప్పలస్వామినాయుడు పర్యవేక్షించారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పండగ


అమ్మవారిని దర్శించుకున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: అంబేడ్కర్ కాలనీలో పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి వారి మొక్కులను తీర్చుకున్నా రు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, స్థానిక వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ సంఘ్ డివిజన్ నూతన కమిటీ


కమిటీ సభ్యులను అభినందిస్తున్న యూనియన్ జనరల్ సెక్రటరీ త్రిలోచన్ సాహూ, బీఎంఎస్ స్టేట్ సెక్రటరీ నాయుడు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే మజ్దూర్ సంఘ్, వాల్తేర్ డివిజన్ నూతన డివిజనల్ కమిటీ నియామకాలు ఇటీవల భువనేశ్వర్‌లో ఏకగ్రీవంగా జరిగాయి. డివిజనల్ ప్రెసిడెంట్‌గా సారిపాక శ్రీనివాస్, సెక్రటరీగా వాల్తేర్ డివిజన్, క్యారేజ్ అండ్ వేగన్ విభాగం గ్రేడ్-1 టెక్నీషియన్ డాక్టర్ వి. రవికిరణ్, ట్రెజరర్‌గా జి. బాలమురళీ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు వివిధ కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. నూతన కమిటీ నియామకం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే మజ్దూర్ సంఘ్ జనరల్ సెక్రటరీ త్రిలోచన్ సాహూ, బీఎంఎస్ స్టేట్ సెక్రటరీ ఎంవీఎస్ నాయుడుల నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను వారు అభినందించారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్. ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎస్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏపీఏ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ ఈ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా పాల్గొనేలా అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఏయూ ప్రొఫెసర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.